వీధులన్నీ కంపు!

అనకాపల్లిలో అధ్వానంగా డ్రైనేజీ కాలువల నిర్వహణ

పేరుకుపోయిన చెత్తాచెదారం, కదలని మురుగునీరు




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద డ్రైనేజీలో కదలని మురుగు

మెయిన్ రోడ్డులో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


పూడిమడకరోడ్డులో ప్రశాంతి హైస్కూల్ వద్ద చెత్తా చెదారంతో నిండిన కాలువ

- దుర్వాసనతోపాటు దోమల బెడదతో జనం సతమతం
- ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పర్యటన
- పారిశుధ్య నిర్వహణ సక్రంగా లేదని అసహనం
- శానిటరీ ఉద్యోగులపై ఆగ్రహం
- అయినా డ్రైనేజీల్లో తొలగని చెత్తాచెదారం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు రహదారుల్లో డ్రైనేజీ కాలువల నిర్వహణ అధ్వానంగా వుంది. కాలువల్లో ఎక్కడా చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి, మురుగునీరు కదలని పరిస్థితి నెలకొంది. ఈ నెల 22వ తేదీన అనకాపల్లిలో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్ పలుచోట్ల డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. అనకాపల్లిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. అన్ని చోట్లా డ్రైనేజీ కాలువల్లో పూడిక, వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది జరిగి ఐదు రోజులు దాటింది. కానీ ఇక్కడ పారిశుధ్య పనుల్లో ఏ మాత్రం పురోగతి లేదు. 'ఆంధ్రజ్యోతి' ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, డ్రైనేజీలను పరిశీలించగా అన్నిచోట్లా కాలువల్లో చెత్తాచెదారం.. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కనిపించింది. రింగురోడ్డు, ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, మళ్ల బ్రదర్స్ జంక్షన్, పూడిమడకరోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, తదితర ప్రధాన ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల నిర్వహణ పారిశుధ్య విభాగం నిర్లక్ష్యానికి అద్దం ... మిగతా 10వ పేజీలో


జన్నవరం వద్ద వైసీపీ రంగుల్లో తాగునీటి పథకం పంపుహౌస్

ఇది కూటమి ప్రభుత్వమేనా!

తాగునీటి పథకాలపై చెరగని వైసీపీ రంగులు

- ప్రభుత్వం మారిపోయి నాలుగున్నర నెలలైనా తీరు మార్చుకోని ఆర్‌డబ్ల్యూఎస్
- కోర్టు ఆదేశించినా రంగులు తొలగించని అధికారులు

చోడవరం, అక్టోబరు 27: గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు రాష్ట్రంలో ఇంకా వైసీపీ పాలనే సాగుతున్నదన్న భావనలోనే వున్నారు. ఐదేళ్లపాటు వైసీపీ సేవలో తరించిన అధికారులు, కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర నెలలు అయినప్పటికీ తీరు మాత్రం మార్చుకోలేదు. ప్రభుత్వ కట్టడాలకు రాజకీయ పార్టీలకు సంబంధించిన రంగులు వేయవద్దని, ఒకవేళ రంగులు వేసివుంటే.. వాటిని తొలగించాలని హైకోర్టు చాలా కాలం క్రితమే ఆదేశించింది. సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వేసిన రంగులు (వైసీపీ జెండాలోని రంగులు) తొలగించినప్పటికీ, జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగానికి చెందిన పలు కట్టడాలకు ఇప్పటికీ వైసీపీ రంగులు కనిపిస్తూనే వున్నాయి. నియోజకవర్గం కేంద్రమైన చోడవరంలో రూ.12.5 కోట్లతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్‌తోపాటు, రాయపురాజుపేట, నరసయ్యపేట, గౌరీపట్నం తదితర పంచాయతీల్లో మంచినీటి పథకాలకు ఇంకా వైసీపీ రంగులేన దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి నాలుగున్నర నెలలు అయినప్పటికీ తాగునీటి పథకాలపై వైసీపీ రంగులు ఉండడాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. రాష్ట్రంలో ఇంకా వైసీపీ పాలనే సాగుతున్నదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భ్రమల్లో వున్నారని టీడీపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు.


రాయపురాజుపేట వద్ద రక్షిత మంచినీటి పథకం


నరసయ్యపేట వద్ద తాగునీటి పథకం ట్యాంకు..

సముద్రంలో ఇద్దరు విద్యార్థులు గల్లంతు

రేవుపోలవరం తీరంలో ఘటన ▸▸ సొంతూరు కొరుప్రోలు

- ఆకస్మికంగా పెద్ద అల రావడంతో నీటమునిగినట్టు స్నేహితులు వెల్లడి
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు


సముద్రంలో గల్లంతైన తురాల అర్జున్, బుంగ సంజయ్‌కుమార్


సముద్రతీరం వద్ద విషాదంలో సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు.

ఎస్.రాయవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని రేవుపోలవరం వద్ద ఆదివారం ఇద్దరు విద్యార్థులు సముద్రంలో మునిగి గల్లంతయ్యారు. స్నేహితులంతా కలిసి సరదాగా గడుపుతుండగా ఆకస్మికంగా పెద్ద అల రావడంతో నీటిలో మునిగిపోయారు. వీరి సొంతూరు ఇదే మండలంలోని కొరుప్రోలు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన రేవుపోలవరం చేరుకున్నారు. పోలీసులు వచ్చి మత్స్యకారుల బోట్ల సాయంతో గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపును నిలిపివేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ విభీషణరావు, మెరైన్ ఏఎస్ఐ ఎం.కృష్ణ, గల్లంతైన విద్యార్థుల స్నేహితులు చెప్పిన వివరాలిలా వున్నాయి.**

ఎస్.రాయవరం మండలం కొరుప్రోలులో శనివారం రాత్రి ఓ వివాహ వేడుక జరిగింది. గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులతోపాటు విజయనగరం, పాడేరు, పెంటకోట నుంచి వివాహ వేడుకకు వచ్చిన వీరి స్నేహితులు ముగ్గురు కలిసి ఆదివారం మధ్యాహ్నం రేవుపోలవరం సముద్ర తీరానికి వెళ్లారు. ఇద్దరు మినహా మిగిలిన వారు నీటిలో దిగి సరదాగా గడుపుతున్నారు. ఈ క్రమంలో తురాల అర్జున్ (19), బుంగ సంజయ్‌కుమార్ అలియాస్ బబ్లూ (18) కొంచెం ముందుకు వెళ్లగా.. ఇదే సమయంలో కెరటాల తాకిడి పెరగడంతో నీటిలో మునిగిపోయారు. అయితే ఈ విషయాన్ని మిగిలిన వారు గమనించలేదు. అర్జున్, సంజయ్‌కుమార్ నీటిలో మునిగిపోతూ చేతులు పైకి ఎత్తి కేకలు పెట్టారు. అయితే సరదాగా ఆడుకుంటున్నారనుకొని మిగిలిన వారు పెద్దగా పట్టించుకోలేదు. ఇంతలోనే మరో పెద్ద కెరటం రావడంతో పూర్తిగా నీటమునిగి గల్లంతయ్యారు. మిగిలిన వారు సుమారు పది నిమిషాల తరువాత ఈ విషయాన్ని గుర్తించి, వెంటనే అక్కడున్న మెరైన్ పోలీసులకు చెప్పారు. మత్స్యకారుల బోట్లతో సముద్రలోకి వెళ్లి గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ విభీషణరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మత్స్యకారుల బోటుతో సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన విద్యార్థుల కుటుంబ సభ్యులు సముద్ర తీరం వద్దకు వచ్చి కన్నీరుమున్నీరయ్యారు. నక్కపల్లి సీఐ రామకృష్ణ వచ్చి పరిశీలించారు. ప్రమాదం గురించి మెరైన ఏఎస్ఐ ఎం.కృష్ణతో మాట్లాడారు. సముద్రంలో గల్లంతైన అర్జున్ విజయనగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం, సంజయ్‌కుమార్ ఐటీఐ చదువుతున్నారు. కాగా సూర్యాస్తమయం వరకు గాలింపు జరిపినప్పటికీ ఆచూకీ లభించడలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలుపుదల చేశామని, సోమవారం ఉదయం గాలింపు చర్యలను కొనసాగిస్తామని ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాక



కొత్తూరు (అనకాపల్లి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 10.25 గంటలకు విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించి 11.45 గంటలకు అనకాపల్లిలోని టీడీపీ జిల్లా కార్యాలయానికి వస్తారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీ రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తారు. 12 గంటల నుంచి 1.30 గంటల వరకు రింగ్‌రోడ్డులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఎదురుగా వున్న పెంటకోట కన్వెన్షన్ హాలులో ఎన్‌డీఏ పార్టీల ప్రతినిధులు, ముఖ్యనేతలతో సమావేశమవుతారు. భోజన విరామం తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు కశింకోట మండలం సుందరయ్యపేటలోని విశాఖ డిస్టిలరీని సందర్శిస్తారు. 3.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని జిల్లా సమీక్ష మండలి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 6.15 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖపట్నం బయలుదేరి వెళతారు.

పక్కాగా పశుగణన


జాతీయ 21వ పశుగణన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, అధికారులు (ఫైల్ ఫొటో)

16 రకాల పశువులు, జంతువుల వివరాలు సేకరణ

- కోళ్లతోపాటు పలు రకాల పక్షులు కూడా..
- ఈ నెల 25న సర్వే ప్రారంభం
- జిల్లాలో 55 మంది సూపర్‌వైజర్లు, 571 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరణ
- అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్‌లో నమోదు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీతో ముగింపు


ఎలమంచిలిలో పశుగణన సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

కోటవురట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో పశుసంపదపై సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకే కేంద్ర ప్రభుత్వ పశుసంవర్థక శాఖ 21వ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రతి ఐదేళ్లకోసారి దేశంలో పశుసంపదను లెక్కించడం 1919 నుంచి జరుగుతున్నది. చిట్టచివరగా 2018లో 20వ పశుగణన నిర్వహించారు. ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు, జడల బర్రెలు, గొర్రెలు, మేకలు, పందులు, ఒంటెలు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, కుందేళ్లు, ఏనుగులు వంటి 15 రకాల పెంపుడు పశువులు/ జంతువులతోపాటు నాటుకోళ్లు, పౌల్ట్రీ కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లు, ఈము, నిప్పుకోడి (ఆస్ట్రిచ్) తదితర పక్షుల వివరాలను సేకరిస్తారు. ఈ ఏడాది అక్టోబరు 25వ తేదీన పశుగణను ప్రారంభించి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీతో ముగిస్తారు. ఇందుకోసం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు వెటర్నరీ, పారావెటర్నరీ సిబ్బందిని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా జంతువులు, పక్షుల వివరాలతోపాటు పెంపకందారుల సమాచారాన్ని కూడా సేకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ పశుసంవర్థక శాఖ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లాలో పశుగణన ప్రక్రియను ఈ నెల 25వ తేదీన ప్రారంభించారు. వాస్తవంగా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి పశుగణను ప్రారంభించాల్సి వుంది. అయితే అనివార్య కారణాల వల్ల అక్టోబరు 25వ తేదీకి వాయిదా పడింది.

జిల్లాలో పశుపోషణపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.34 లక్షల కుటుంబాలు జీవనం ... మిగతా 10వ పేజీలో

పశుగణన సర్వేకు సహకరించాలి



పశుగణన సర్వే పక్కాగా సాగాలంటే ప్రజలు అన్ని విధాలా సహకరించాలి. గ్రామాలే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా ఈ సర్వే జరుగుతుంది. వ్యక్తిగత నివాసాల్లో వుండే వారి నుంచి సమాచారం సేకరించడంలో పెద్దగా ఇబ్బంది వుండదు. అపార్టుమెంట్లలో వుండే వారు పశుగణన సిబ్బంది వచ్చినప్పుడు వారికి సహకరించి పూర్తి సమాచారం ఇవ్వాల్సి వుంటుంది.

పెట్ల నరేశ్, పశుసంవర్థక శాఖ ఏడీ, కోటవురట్ల

మందకొడిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

ఉత్తరాంధ్రలో ఇప్పటి వరకు 1,200 మంది మాత్రమే దరఖాస్తు

- 6వ తేదీతో ముగియనున్న గడువు
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదుకు అవకాశం

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈ పరిధిలోని ఆరు జిల్లాల్లో స్కూలు అసిస్టెంట్, అంతకంటే ఎక్కువ హోదా కలిగిన టీచర్లు, లెక్చరర్లు, ఆచార్యులు ఓటర్లుగా తమ పేర్లు నమోదుచేసుకోవచ్చు. ఓటర్ల నమోదుకు గత నెల 30వ తేదీన నోటిఫికేషన్ జారీ అయింది. ఆ తరువాత దసరా సెలవులు రావడంతో ఉపాధ్యాయ వర్గాలు దీనిపై దృష్టి సారించలేదు. కాగా ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా అవకాశం ఇచ్చింది.**

ఉత్తరాంధ్ర పరిధిలో ఇప్పటి వరకు 1,200 మంది టీచర్లు మాత్రమే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ టీచర్లతోపాటు ప్రైవేటు పాఠశాలలు/కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఓటు హక్కు కల్పిస్తారు. 2018లో జరిగిన ఎన్నికల్లో 21వేల మంది ఓటు వేయగా, ఈ సారి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓటర్ల నమోదుకు వచ్చే నెల ఆరవ తేదీ వరకు గడువుంది.

ఎన్నికల బరిలో దిగే అభ్యర్థుల తరఫున ఓటర్ల నమోదు చేపట్టేందుకు ఆయా ఉపాధ్యాయ సంఘాలు సన్నాహాలు చేస్తున్నాయి. దీనిపై దీపావళి తరువాత పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారంచేసే అవకాశం ఉంది. ఓటర్ల నమోదుకు సంబంధించి ఒక పాఠశాల/కళాశాల నుంచి మొత్తం దరఖాస్తులు తహసీల్దార్లకు అందజేయాలి. ఉన్నత పాఠశాల/కళాశాల నుంచి హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో తహసీల్దార్లకు అప్పగించాలి. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/లెక్చరర్లు దరఖాస్తులను డీఈవో ధ్రువీకరించాలి. అయితే ఇంతవరకు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాలేదు. చివరి నిమిషంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తే తహసీల్దార్లు ఉక్కిరిబిక్కిరవుతారని, ధ్రువీకరించడానికి డీఈవోలకు కూడా సమయం సరిపోదని భావిస్తున్నారు. ఇదిలావుండగా ఓటరు నమోదుపై ఆరు జిల్లాల డీఈవోలు, ఆర్ఐవోలు, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పలుమార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదును వేగవంతం చేయాలని కోరారు.

ప్రాణం తీసిన వేగం

ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

- మృతుల్లో ఒకరు ఇంజనీరింగ్ విద్యార్థి
- ఆనందపురం వద్ద జాతీయ రహదారిపై ఘటన


ధనుంజయ్ (ఫైల్)

ఆనందపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అతి వేగం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన ఆనందపురం మండలం గుమ్మడిపాలెం వద్ద 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెందుర్తికి చెందిన దొడ్డి ధనుంజయ్ (20), మోహనసాయి, మరికొంత మంది స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాలపై ఆదివారం భీమిలి బీచ్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడ సరదాగా గడిపిన వారు రాత్రి 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. ధనుంజయ్, మోహనసాయి బజాజ్ ఆర్15 బైక్‌పై అమితవేగంతో వెళ్తుండగా గుమ్మిడివానిపాలెం వద్ద రోడ్డు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కోరాడ చిట్టిబాబు (60)ను ఢీకొన్నారు. దీంతో అదుపుతప్పిన బైక్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డు దాటుతున్న చిట్టిబాబు, బైక్ వెనుక కూర్చున్న ధనుంజయ్ (20) అక్కడికక్కడే మృతిచెందగా, బైక్ నడుపుతున్న మోహనసాయికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని వెంటనే ... మిగతా 10వ పేజీలో

కార్మికులకు అమలుకాని కనీస వేతనాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

రాంబిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేవల్ బేస్, ఫార్మా ప్రమాదాలు, అధిక పొల్యూషన్ వంటి సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఆదివారం స్థానిక తుపాన్ రక్షిత భవనంలో జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, స్థానికులకు ఉపాధి కల్పించడం లేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఎస్ఈజడ్, ఎన్ఏవోబీ నిర్వాసితులు, ఈ ప్రాంత రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. కొత్తూరు ఏడుముళ్ల ఆనకట్టు కొట్టుకుపోవడంతో సాగు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేవీ గేటు నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు రోడ్డును బాగు చేయించాలన్నారు. తొలుత సీపీఎం జెండాను లోకనాథం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా దేముడునాయుడును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రాము, నాయకులు ఎస్.నారాయణరావు, సీహెచ్ రామకృష్ణ, ధోని, కాశియ్య, వై.రాములను శాఖ కార్యదర్శులుగా ఎన్నికున్నారు. కార్యక్రమానికి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

100 మంది భక్తులతో గీతా పారాయణం


ఉపమాక ఆలయం వద్ద గీతా పారాయణం చేస్తున్న భక్త బృందం

నక్కపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆదివారం కాకినాడ శ్రీకృష్ణ పరివార్, ఉపమాక దుర్గా భవానీ సేవా సొసైటీ ఆధ్వర్యంలో గీతా యజ్ఞం కార్యక్రమం ఘనంగా జరిగింది. భగవద్గీతలోని 18 అధ్యాయాలను సుమారు 100 మంది మహిళా భక్తులు పారాయణం చేశారు. శ్రీకృష్ణ పరివార్ వ్యవస్థాపకులు పెద్దిబొట్ల మాధురీ రామకృష్ణ నేతృత్వంలో బృందం అనేక క్షేత్రాల్లో గీతాయజ్ఞం చేపడుతోంది. ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి, గురుభవానీలు దవరసింగి రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల జిల్లా విజేతలు


జిల్లా స్థాయి చెకుముకి పోటీల విజేతలతో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విజేతలుగా నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండల కేంద్రంలో గల ప్రశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలలో రాష్ట్రస్థాయిలో పాల్గొనే విద్యార్థులను జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ప్రకటించారు. ఈ పోటీలలో జె.గుణశ్రీ, నవ్యశ్రీ, బి.దివ్య, సాయి శ్రవణ, ఎంఎస్వీ.సాత్విక్, ఎస్.కిరణ్ కుమార్ విజేతలుగా నిలిచారు. ఈ పరీక్షలలో 60 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు సర్టిఫికెట్‌లు అందజేశారు. వీరు నవంబరు 9, 10 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు నాగచంద్ర, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, కార్యదర్శి బొడ్డేడ రాంకుమార్, పి.రంగరాజు, ఎం.శేషగిరిరావు, రమేష్, వర్మ, శ్రీమూర్తి, దొర, మల్లేష్ లింగం, రమణ పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న ఎలమంచిలి వ్యక్తి అరెస్టు

రూ.3.11 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పాయకరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా పలు రైళ్లలో దొంగతనాలు చేస్తున్న ఎలమంచిలికి చెందిన ఒకరిని ఆదివారం తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రూ.3.11 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. డీఎస్పీ డి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం తుని రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించి, వివిధ రైళ్లలో ప్రయాణికుల నుంచి నగదు, బంగారు వస్తువుల దొంగతనాలకు పాల్పడుతున్న ఎలమంచిలికి చెందిన నరాలశెట్టి జోతిస్ దుర్గాప్రసాద్(19)ను పట్టుకున్నట్టు చెప్పారు. అతడి నుంచి 47 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.ఆరు వేలు నగదు కలిపి రూ.3,11,500 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో కాకినాడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తుని, అనకాపల్లి ఆర్పీఎఫ్ ఏఎస్ఐలు గోవిందరాజు, అనిల్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

శేషుగెడ్డ పొంగినప్పుడల్లా

వాహనాల రాకపోకలకు అంతరాయం


ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న రక్షణ లేని కల్వర్టు

ఎలమంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణ ప్రధాన రోడ్డుపై 12 ఏళ్లుగా రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా కల్వర్టు దర్శనమిస్తోంది. నిత్యం వందలాది స్కూలు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరుగాడే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టును అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. పట్టణ సమీపంలోని శేషుగెడ్డ నదిపై ఉన్న ఈ కల్వర్టుపై వెళుతుంటే వాహనదారులు భయపడుతుంటారు. కల్వర్టుకు రెండు వైపులా ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. శేషుగెడ్డలో వరద నీరు ఉధృతి పెరిగినప్పుడల్లా ఈ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో గంటల తరబడి ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఇటీవల రెండుసార్లు శేషుగెడ్డ పొంగి వరద నీరు కల్వర్టుపై నుంచి పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గెడ్డకు అవతల వైపు పోలీస్ సర్కిల్ కార్యాలయం, పలు ప్రైవేటు పాఠశాలలు, పలు కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మినీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శిథిల స్థితిలో ఎంపీడీవో కార్యాలయం

- భవనం పిల్లర్లు, శ్లాబ్‌ల నుంచి పడుతున్న పెచ్చులు
- గదులలో ఊడిపడుతున్న సీలింగ్
- లోపలకు చేరుతున్న వర్షపు నీరు
- భయపడుతూ పనిచేస్తున్న సిబ్బంది

రాంబిల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణాన శ్లాబ్ పెచ్చులు ఊడి ఎవరి మీద పడతాయో, ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది భయపడుతున్నారు. 22 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రమాదకరంగా మారింది. కార్యాలయంలో గదుల గోడలు బీటలు వారిపోయాయి. శ్లాబ్ పెచ్చు పడిపోతనాన్నాయి. ప్రధాన పిల్లర్లకు భారీగా పగుళ్లు ఏర్పాడ్డాయి. కార్యాలయం కిటికీలు, సన్‌సైడ్‌లు


కార్యాలయం కిటికిల సన్‌సైడ్ దెబ్బతిన్న దృశ్యం

దెబ్బతిన్నాయి. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిసిన సమయంలో నీరు కార్యాలయ గదుల్లోకి చేరుతున్నది. దీంతో కంప్యూటర్లు, రికార్డులు తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కార్యాలయంలోని రికార్డుల గదులు కూడా దెబ్బతిన్నాయి. వెనుకభాగం పూర్తిగా దెబ్బతింది. ఎంపీపీ, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారుల గదులు కూడా పాక్షికంగా దెబ్బతినడంతో విధులు నిర్వహించేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయ భవనం పరిస్థితి అధ్వానంగా ఉన్నా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయ భవనానికి మరమ్మతలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


పిల్లర్‌కు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

అట్టహాసంగా పడమటమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

- అలరించిన కోలాటం

ఎలమంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద ఆదివారం అట్టహాసంగా పడమటతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక కుంకుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌జీపాలెం గ్రామానికి చెందిన మహిళల కోలాటం ఆద్యంతం ఆకట్టుకుంది. తలపై కుండలో నిప్పులు పెట్టుకుని వేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు రెండు గంటలపాటు మహిళల కోలాటం వినూత్నంగా ఆకట్టుకుంది. స్థానిక యువత పర్యవేక్షణలో అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు.


పూజలు అందుకుంటున్న అమ్మవారు


తలపై కుండలో నిప్పులు మంటతో కోలాటం ఆడుతున్న మహిళలు

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు


పూడిమడకలో టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకున్న తెలుగు తమ్ముళ్లు


రాజయ్యపేటలో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పెదిరెడ్డి చిట్టిబాబు

అచ్యుతాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆదివారం పూడిమడకలో ఉత్సాహంగా సాగింది. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుని మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు పూలమాలతో సన్మానించారు. అనంతరం ప్రగడ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోరు భారీ సంఖ్యలో జగుగుతోందన్నారు. కార్యక్రమంలో మేరుగు వెంకటరావు, పొన్నమళ్ల కొండబాబు, మహేష్, సమ్మింగి లక్ష్మణ, దోని కాసుబాబు, ఉమ్మిడి కొబడయ్య, దోని ఎర్రయ్య పాల్గొన్నారు.

రూ.లక్ష సభ్యత్వం తీసుకున్న ప్రగడ

ఎలమంచిలి: తెలుగుదేశం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు లక్ష రూపాయల విలువ చేసే టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు ద్వారా 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సదుపాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ప్రగడ అన్నారు. గతంతో కన్నా ఈ దఫా జరిగే సభ్యత్వ నమోదును అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

పాయకరావుపేట రూరల్: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృత ప్రచారం చేపట్టడం ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పాల్మన్‌పేట పంచాయతీ రాజయ్యపేటలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం, నాయకులు చింతకాయల రాంబాబు, పిర్ల కళ్యాణి, మోసా సతీష్, అశోక్ చక్రవర్తి, చొక్కా కృష్ణ, పిర్ల గోవిందు, నేమాల కాసులు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని ఈపీడీసీఎల్ సిబ్బంది, అధికారులు


దుర్గామాత ఆలయం వద్ద ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాలు, ప్రజల రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నా సంబంధితాధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. వీటి వల్ల ఎప్పుడు ప్రమాదం వాటిల్లుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన ఈపీడీసీఎల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఎలమంచిలి సమీపంలోని పెంజెరువుకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల్లో మూడు వరకు ఒరిగిపోయి ఉన్నాయి. ఈ రోడ్డు మీదుగా ఎస్.రాయవరం మండలంలోని సగం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు మీదుగా వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో ఈ విద్యుత్ స్తంభాలు నేలకూలితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉండడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారని పలువురు వాపోతున్నారు. స్థానికంగా అధికారులు ఉండకపోవడంతో విద్యుత్ సేవలు అందడంలో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాల లైన్లను పర్యవేక్షించి, వాటిని సరిచేయించాలని పలువురు కోరుతున్నారు.


పెంజెరువు మార్గంలో ఒరిగిన మరో విద్యుత్ స్తంభం

ఎయిర్‌పోర్టుకు అల్లూరి నామకరణం హర్షణీయం

స్పీకర్ అయ్యన్నపాత్రుడును

సన్మానించిన క్షత్రియులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపిక అందిస్తున్న క్షత్రియ పరిషత్ ప్రతినిధులు

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించడం హర్షణీయమని క్షత్రియ పరిషత్ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు గణపతిరాజు బంగార్రాజు ఆధ్వర్యంలో వేదపండితుల ఆశీర్వచనాలతో సభాపతి అయ్యన్నపాత్రుడును సన్మానించారు. ఎయిర్‌పోర్టుకు అల్లూరి పెట్టేందుకు స్పీకర్ అయ్యన్న ఎంతో కృషి చేశారని వారు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ చదువుకునే రోజుల నుంచి రాజులతో తనకు సత్సంబంధాలు ఉండేవన్నారు. ఎన్నికలలో ప్రతీసారి సహాయ సహకారాలు అందించారన్నారు. పెదబొడ్డేపల్లి మదుం వద్ద రెండు వంతెన మధ్యలో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని అయ్యన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ ప్రతినిధులు చక్రపాణి రాజు, నాగేంద్రరాజు, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబురాజు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటలకు సమగ్ర పోషకాలు

- కేవీకే ప్రొఫెసర్ సౌజన్య

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలకు సమగ్ర పోషకాలు అందుతాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కొండెంపూడి ప్రొఫెసర్ డాక్టరు సౌజన్య అన్నారు. ఆదివారం పీఏసీఎస్ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందుల వినియోగం వల్ల సాగు ఖర్చు అధికమవుతుందన్నారు. అలాగే కాలక్రమేణా సూక్ష్మ పోషకాల లోపాలు అధికమవుతాయన్నారు. కంపోస్టు, పశువుల ఎరువులను తయారు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సౌజన్య, రవిబాబు వివరించారు.

నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, అక్టోబరు 27: ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నూతన 33 కేవీ లైను వేసేందుకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ధర్మవరం, కాకివానివీధి, రామచంద్రమ్మ కాలనీ, కల్కిపెట్రోల్ బంకు, పెంజెరువు ప్రాంతం, సోమలింగపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అమలాపురంలో ముగ్గురమ్మల ఆలయం ప్రారంభం


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


అమలాపురం గ్రామంలో బోనాల సంబరం

నక్కపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన కనకమహాలక్ష్మి, బంగారమ్మ, నూకాలమ్మతల్లి (ముగ్గురమ్మల) ఆలయ సముదాయం ప్రతిష్ఠప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేదపండితుల బృందం ఆధ్వర్యంలో ఆలయ కలశ ప్రతిష్ఠ, అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది.

పాల ధర తగ్గింపుపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ పాల ధరను తగ్గించడంపై సీపీఎం మండల కమిటీ వాల్ పోస్టర్‌ని ఆదివారం విడుదల చేసింది. ఈసందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము మాట్లాడుతూ వ్యవసాయ రంగం లాభదాయకంగా లేకపోవటంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడు లక్షల మంది పేదరైతు కుటుంబాలు పాడిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కాని విశాఖ డెయిరీ పాల ధరను తగ్గించడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఆవుపాలు లీటరుకి రూ.50, గేదె పాలకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాల ధరను పెంచకపోతే భారీ స్థాయిలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రామకృష్ణ, సత్యనారాయణ, నాయుడు, సత్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయం సమస్యలపై వినతి

ఎలమంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి సంఘ ప్రతినిధులు శనివారం కమిషనర్ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశారు. నిరుపేదలు నివాసం ఉంటున్న ఈ గృహ సముదాయంలో తాగు నీటి సదుపాయంతోపాటు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని, రేషను వాహనం కాలనీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ప్రసాద్, హైరామ్, ఆషారాణి పాల్గొన్నారు.

చలో విశాఖ డెయిరీని విజయవంతం చేయాలి


ఏటికొప్పాకలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఎలమంచిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీన నిర్వహించే చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని రైతులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు సంఘం ప్రతినిధులు కోరారు. డెయిరీ పాల ధర పెంచాలని కోరుతూ ఆదివారం ఏటికొప్పాక పాల సేకరణ కేంద్రం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ, సత్యనారాయణ, ఈశ్వరరావు, రైతులు నానిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

- నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సీసీ కెమెరాలు
- మునిసిపల్ కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారులపై చెత్త వేసే వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర హెచ్చరించారు. ఆదివారం పెద్ద చెరువు వద్ద పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు వద్ద త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ మల విసర్జన, పండ్లు, కూరగాయాల వ్యర్థాలు, జంతు కళేబరాలు వేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తున్నదన్నారు. ప్రతీ రోజు చెత్త ఎత్తిస్తున్నా మర్నాడు మళ్లీ వేస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే బొంతువీధి సాయిబాబా గుడి ప్రవేశ మార్గంలో పండ్లు, పువ్వులు, కూరగాయ వ్యాపారులు రోడ్డు మీద వ్యర్థాలు పడేస్తున్నారని తెలిపారు. అనకాపల్లి రోడ్డులో కూడా అదే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు మీద చెత్త పోస్తున్న వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. స్పీకర్ ఆదేశాలతో కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా ఉత్తర వాహిని వద్ద శుభ్రం చేయిస్తున్నామని కమిషనర్ చెప్పారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే మరి కొంతమంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. భక్తులకు న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంట కాలువపై ఆక్రమణల తంటా..!



జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పంట కాలువ

ఉగ్గినపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

- పట్టించుకునేవారు లేకపోవడంతో పెరిగిపోతున్న నిర్మాణాలు
- పంట పొలాలకు వర్షపు నీరు పారేదెలా.. అని ప్రశ్నిస్తున్న రైతులు



పంట కాలువపై అక్రమ నిర్మాణాలు

ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు.. ప్రభుత్వ జాగా అని తెలిస్తే చాలు.. పాగే వేసేస్తున్నారు. తొలుత కర్రలు, కమ్మలు, రేకులు.. తదితరాలతో చిన్నపాటి పాక వంటిది ఏర్పాటు చేస్తున్నారు. కొన్నాళ్లపాటు వేచి చూస్తున్నారు.. అడిగేవారు లేకపోతే.. దాని స్థానంలో పక్కా నిర్మాణం చేపడుతున్నారు. ఈ తంతు అంతా ఆయా అధికారుల కళ్ల ముందే సాగుతున్నా ప్రశ్నించలేకపోతున్నారు. ఫలితంగా ఒకరిని చూసి.. ఒకరు అన్నట్టుగా.. అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఇందుకు ఉగ్గినపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో చేపట్టిన కట్టడాలనే ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

కశింకోట, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 159లో చెరువు ఉంది. ఈ చెరువులో కొండపై నుంచి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. కాలువ ద్వారా పంట భూములకు ఆ నీరు అందుతుంది. ఇటీవల కాలంలో ఈ పంట కాలువను ఆక్రమించి వాటిపై పలువురు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్టుగా పనులను జరుపుతున్నారు. అయినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో తమ సాగు భూములకు నీరు చేరేది ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు పాన్‌షాపు ఏర్పాటు.. నేడు గోడలు నిర్మాణం

రెండేళ్ల క్రితం ఇక్కడ ఓ పాన్‌షాపును ఏర్పాటు చేశారు. కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో కాల క్రమేణా ఏకంగా రాత్రి సమయంలో కాలువపై చిన్నపాటి శ్లాబ్ వేస్తూ నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతం జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో ఇక్కడ భూముల ధరలు పెరిగాయి. సెంటు స్థలం సుమారు రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఆక్రమణలకు అడ్డులేకుండా పోతోంది. పంట కాలువపై నిర్మాణాలు చేస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇలా ఎవరికి నచ్చినట్టు వారు కాలువలపై నిర్మాణాలు చేపట్టడం వల్ల కాలువ విస్తీర్ణం తగ్గిపోయి, వర్షాలు కురిసే సమయాల్లో నీటి ప్రవాహం కష్టంగా మారనుందని అంటున్నారు.



రేకుల షెడ్డు నిర్మాణం

జాతీయ రహదారి పొడవునా అక్రమ నిర్మాణాలు!

ఇదిలావుంటే, జాతీయ రహదారిపై వ్యాపారాల నిమిత్తం చిన్న షెడ్డులు ముందుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్నాళ్ల తరవాత పట్టించుకునేవారు లేకపోవడంతో వాటినే పక్కా నిర్మాణాలుగా మార్చుతున్నారు. ఇలా జాతీయ రహదారి పొడవునా అక్రమ నిర్మాణాలు సాగుతుంటే అధికారుల్లో చలనం లేకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఉగ్గినపాలెంలో పంట కాలువపై అక్రమ నిర్మాణాల విషయాన్ని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములు, చెరువు గర్భాలు, పంట కాలువలు ఆక్రమణ చట్టరీత్యా నేరమన్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

\- శ్రీనివాసరావు, తహసీల్దార్, కశింకోట

నిబంధనలు ఉల్లంఘించి బాణసంచా విక్రయిస్తే చర్యలు : ఎస్పీ



తుహిన్ సిన్హా, ఎస్పీ

అనకాపల్లి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించి బాణసంచా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదివారం స్పష్టం చేశారు. బాణసంచాను అనుమతి లేకుండా తయారు చేసినా, నిల్వ ఉంచినా ఉపేక్షించేది లేదన్నారు. షాపుల యజమానులు అగ్నిప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సు కలిగిన దుకాణదారులు మాత్రమే విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రత్యేక షెడ్డుల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైనర్‌లను బాణసంచా తయారీ, విక్రయ పనుల్లో నియమించరాదని వివరించారు. జనావాసాలకు, విద్యా సంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా విక్రయాలు నిర్వహించాలన్నారు. దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలంతా ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు బాణసంచా వెలిగించే సమయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పండగ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, అత్యవసర సమయంలో అగ్నిమాపక కేంద్రం 101, పోలీస్ 100 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నేటి నుంచి స్వాములకు అన్నప్రసాదం



అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు ప్రతి రోజూ మాలధారణ చేసే భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్టు అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు, కార్యదర్శి వుప్పల శ్రీనివాసరావు, కోశాధికారి వీవీఎన్‌కే పేర్రాజు తెలిపారు. ముత్యాల వెంకటేశ్వరరావు, చింతాడ హేమారావు ఆర్థిక సహాయంతో అయ్యప్ప, భవానీ, శివ, వెంకటేశ్వరస్వామి తదితర మాల ధారణ చేసిన భక్తుల కోసం ఈ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

విజయరామరాజుపేట పార్కులో శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న విజయరామరాజుపేట యువకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద గల పార్కు, జిమ్‌లో స్థానికులు ఆదివారం శ్రమదానాన్ని నిర్వహించారు. మనపేట- మన బాధ్యత పేరిట తుప్పలను తొలగించారు. ఈ ప్రాంతంలో విష సర్పాలు సంచరిస్తుండడం వల్ల జిమ్‌కు వచ్చేవారు భయాందోళన చెందుతున్నారని తెలుసుకున్న యువకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆళ్ల రామచంద్రరావు తెలిపారు. విజయరామరాజుపేటలో వీధిలైట్లు, మంచినీరు, పారిశుధ్యం వంటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకవస్తే అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

ఎంజీహెచ్‌లో పూర్వ విద్యార్థులు సమావేశం



పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తూరు, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లిలో మునిసిపల్ గవరపాలెం హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, చైర్మన్ పిళ్లా శివ అప్పారావు, గౌరవ సలహా సభ్యులు పి.సత్యనారాయణ భవిష్యత్తులో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు. 1970-75లో విద్యనభ్యసించిన వారంతా ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాగా డిసెంబర్ 29వ తేదీ ఆదివారం సంఘంలోని వారి కుటుంబ సభ్యులతో కలిసి వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయించామన్నారు. ముందుగా వారంతా పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి దాడి శివరామకృష్ణ, కోశాధికారి పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భరిణికంలో రెవెన్యూ గ్రామ సభ రేపు

పరవాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భరిణికం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతుల నుంచి వచ్చే అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

మొగలిపురంలో గౌరమ్మ సంబరాలు



గౌరమ్మకు రవికుమార్ తదితరుల పూజలు

సబ్బవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొగలిపురంలోని కర్రివారి కళ్లాల వద్ద ఆదివారం గౌరమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. వైసీపీ నాయకులు గండి రవికుమార్, యువజన విభాగం మండల అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపురపు వాసు, ఐడి బాబు, బైలపూడి మలునాయుడు, దేముడు, కర్రి నాగరాజు, అమ్మతల్లి, ముత్యాలనాయుడు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

గవరపేట వీధిలో పారిశుధ్య పనులు

తుమ్మపాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈ పంచాయతీ పరిధి గవరపేట వీధిలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆక్రమణలను తొలగించి కాలువల నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ పనులను పంచాయతీ అధికారులు, నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు మాట్లాడుతూ తుమ్మపాల పంచాయతీ పరిధిలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాయకులు పంచదార్ల కన్నారావు, చదరం చిన్న తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సత్యం మృతి



బలిరెడ్డి సత్యం (ఫైల్ ఫొటో)

సబ్బవరం, అక్టోబరు 27 : వీఆర్‌వోల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బలిరెడ్డి సత్యం (80) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈయన స్వగ్రామం మండలంలోని ఇరువాడ. కరణంగా, మునసబుగా కూడా పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అంత్యక్రియలు సోమవారం ఉదయం పది గంటలకు జరుగుతాయని గ్రామ పెద్ద రేసుపూడి రమణ తెలిపారు.

ఘనంగా నూకాంబిక పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న రాంకీ తదితరులు

కశింకోట, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో నూకాంబిక అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ దర్శించుకున్నారు. కూటమి నాయకులు గొంతిన శ్రీను, సిదిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీష్, దాడి నాగరాజు, తాకాశి కృష్ణ, వేగి తారకేశ్వరరావు, వేగి రామకోటి, ఆళ్ళ రామచంద్రరావు, మళ్ళ శ్రీను, గొల్లబాబు, మంగా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి

- గత ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- పంటలు పండించేందుకు రైతులు అష్టకష్టాలు
- కూటమి అధికారంలోకి రావడంతో పూర్వ వైభవానికి సంకల్పించిన పాలకులు



సబ్బవరంలోని పోతురాజు చెరువు

సబ్బవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి ఆరంభమైంది. రాష్ట్ర విభజన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించింది. సాగునీటి వనరుల బలోపేతానికి నీరు- చెట్టు పథకం కింద చెరువుల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించింది. ఫలితంగా నీటి మట్టం పెరిగింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించింది. ఆ సమయంలో సాగు నీటి చెరువుల అభివృద్ధికి ఎటు వంటి చర్యలు తీసుకోలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఈకారణంగా ఐదేళ్లపాటు సాగుకు అష్టకష్టాలు పడ్డామని వాపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలు నిర్వహించ తలపెట్టారు. దీంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సబ్బవరం మండలంలో వంద ఎకరాలు ఆయకట్టు పైబడిన సాగునీటి చెరువులు 23 ఉన్నాయి. ఈ మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏఏ చెరువు కింద ఎంత విస్తీర్ణం సాగులో ఉంది, ఎంత మంది ఓటర్లు ఉన్నారన్న నివేదికలను నేతలు సేకరిస్తున్నారు. ఓటు హక్కు లేనివారికి ఓటు హక్కును కల్పించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించే పనిలో బిజీగా ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..

ఒక్కో చెరువు కింద ఉన్న ఆయకట్టును ఆరు టెరిటోరియల్ కాన్సిస్టెన్సీలుగా విభజించనున్నారు. ఒక్కో కాన్సిస్టెన్సీకి ఒక డైరెక్టర్‌ను ఆ పరిధిలో ఉన్న ఓటర్లు (రైతులు) ఎన్నుకుంటారు. ఆరుగురు డైరెక్టర్లలో ఒకరిని ఆ సాగునీటి సంఘానికి మిగతా ఐదుగురు డైరెక్టర్లు అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. ఓటు వేసే రైతుకు భూమి పాస్ పుస్తకం కానీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన గుర్తింపు పత్రం(అండంగళ్) కానీ తప్పనిసరిగా ఉండాలి. సాగునీటి చెరువు కింద భూమి ఉన్నా ఎటువంటి పత్రం లేకుంటే ఓటు హక్కు కల్పించడం జరగదని ఇరిగేషన్ జేఈ ఎస్.సాయికిరణ్ తెలిపారు.

21,22,23 తేదీల్లో ఎన్నికలు

ఇదిలావుంటే, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నవంబరు పదో తేదీన అధికారులు సాగునీటి చెరువుల ఆయకట్టు వారీగా ఓటరు జాబితాలను విడుదల చేస్తారు. 19 వరకూ అభ్యంతరాలు, సవరణలు చేపట్టి అదే రోజు తుది జాబితా విడుదల చేస్తారు. 20న నోటిఫికేషన్ విడుదల చేసి 21, 22, 23 తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.

పాల సేకరణ ధర తగ్గింపుపై రైతుల ఆందోళన




బుచ్చెయ్యపేట పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న పాడి రైతులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ తగ్గించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట పాల సేకరణ కేంద్రాల వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం చోడవరం డివిజన్ నేత పినపాత్రుని సాంబశివరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీకి రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పాలు పోస్తున్నారని, అయినా రైతులకు గిటుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయం గిటుబాటు కాకపోవడంతో పాడిపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారన్నారు. గతంలో ఉన్న ధర కన్నా లీటరు ఆవు పాలకు రూ.3 తగ్గిస్తున్నట్టు విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. పెరుగుతున్న దాణా ఖర్చులతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రస్తుత ధర కన్నా లీటరు రూ.10 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. తగ్గించిన పాలధరను పెంచే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాంబశివరావు పాడి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రతినిధులు ఎస్‌వీ నాయుడు, దాడి నాయుడు, పూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.







పంచకర్లకు జనసేన నేతల సత్కారం



పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సత్కరిస్తున్న జనసేన నాయకులు

చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జనసేన జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును పార్టీ నియోజకవర్గ నాయకులు శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ నేతలతో భేటీ సందర్భంగా పంచకర్లను నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు, జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేశ్, ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన సమస్యలను పంచకర్లకు ముందుంచారు.

వృద్ధులు, అనాథలకు అన్నసమారాధన



బిచ్చగాళ్లకు ఆహార పొట్లాలు అందిస్తున్న సేవా సంఘ సభ్యులు

రోలుగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వృద్ధులు, అనాథలు, బిచ్చగాళ్లకు హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సేవా సంఘం కొత్తకోట వారి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా రోలుగుంట, పెదబొడ్డేపల్లి వృద్ధాశ్రమాలతో పాటు బిచ్చగాళ్లకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ విరోతి ఆనంద్, నూతన అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏడాది కాలంగా వృద్ధులు, అనాథులు, దివ్యాంగులు, భిక్షాటన చేసే వారి ఆకలి తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 50 మందికి పైగా వలంటీర్లు పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు.



రోడ్లపై చెత్త వేస్తే జరిమానా


- నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సీసీ కెమెరాలు
- మునిసిపల్ కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారులపై చెత్త వేసే వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర హెచ్చరించారు. ఆదివారం పెద్ద చెరువు వద్ద పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు వద్ద త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ మల విసర్జన, పండ్లు, కూరగాయాల వ్యర్థాలు, జంతు కళేబరాలు వేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తున్నదన్నారు. ప్రతీ రోజు చెత్త ఎత్తిస్తున్నా మర్నాడు మళ్లీ వేస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే బొంతువీధి సాయిబాబా గుడి ప్రవేశ మార్గంలో పండ్లు, పువ్వులు, కూరగాయ వ్యాపారులు రోడ్డు మీద వ్యర్థాలు పడేస్తున్నారని తెలిపారు. అనకాపల్లి రోడ్డులో కూడా అదే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు మీద చెత్త పోస్తున్న వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. స్పీకర్ ఆదేశాలతో కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడానికి వీలుగా ఉత్తర వాహిని వద్ద శుభ్రం చేయిస్తున్నామని కమిషనర్ చెప్పారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే మరి కొంతమంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. గ్రామంలో కాలినడకన నెత్తిన ఘటాలతో ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు ఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని దర్శనానికి వచ్చిన భక్తులకు కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

















జవహర్‌క్లబ్ పాలకవర్గం అధ్యక్షుడిగా పోతల ప్రకాశరావు



చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానమైన జవహర్ క్లబ్‌కు ఆదివారం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలకవర్గం నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది పోతల ప్రకాశరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బుద్ధా వెంకటరమణ, కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.రవీంద్ర ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా బి.మధుసూదనరావు, బి.జగన్నాథకుమార్, డి.వెంకటరావు, కె.ఈశ్వరరావు, పి.లక్ష్మణరావు, మురళీకృష్ణ ఎన్నికయ్యారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపిక అందిస్తున్న క్షత్రియ పరిషత్ సంఘ ప్రతినిధులు

ఎయిర్‌పోర్టుకు అల్లూరి నామకరణం హర్షణీయం

స్పీకర్ అయ్యన్నపాత్రుడును సన్మానించిన క్షత్రియులు

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించడం హర్షణీయమని క్షత్రియ పరిషత్ సంఘ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు గణపతిరాజు బంగారాజు ఆధ్వర్యంలో వేదపండితుల ఆశీర్వచనాలతో సభాపతి అయ్యన్నపాత్రుడును సన్మానించారు. ఎయిర్‌పోర్టుకు అల్లూరి పెట్టేందుకు కృషి చేసిన స్పీకర్ అయ్యన్న ఎంతో కృషి చేశారని వారు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ చదువుకునే రోజుల నుంచి రాజులతో తనకు సత్సంబంధాలు ఉండేవన్నారు. ఎన్నికలలో ప్రతీసారి సహాయ సహకారాలు అందించారన్నారు. పెదబొడ్డేపల్లి మదుం వద్ద రెండు వంతెన మధ్యలో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని అయ్యన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ ప్రతినిధులు చక్రపాణి రాజు, నాగేంద్రరాజు, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబురాజు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో పంటలకు సమగ్ర పోషకాలు

కేవీకే ప్రొఫెసర్ సౌజన్య



సంఘ ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న డాక్టరు సౌజన్య

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలకు సమగ్ర పోషకాలు అందుతాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కొండెంపూడి ప్రొఫెసర్ డాక్టరు సౌజన్య అన్నారు. ఆదివారం పీఏసీఎస్ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందుల వినియోగం వల్ల సాగు ఖర్చు అధికమవుతుందన్నారు. అలాగే కాలక్రమేణా సూక్ష్మ పోషకాల లోపాలు అధికమవుతాయన్నారు. కంపోస్టు, పశువుల ఎరువులను తయారు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సౌజన్య డాక్టరు రవిబాబు వివరించారు.

బుచ్చెయ్యపేటలో రక్తదాన శిబిరం రేపు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బ్లెస్సింగ్ చర్చి వద్ద సీఎల్‌సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 29న రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుంది. అలాగే జనరల్, కంటి వైద్య వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన్ సంస్థ వైద్య నిపుణులు, అన్ని రకాల వ్యాధుల నిపుణులతో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తామని బ్లెస్సింగ్ చర్చి ప్రతినిధులు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడి పక్కన వైన్‌షాపు వద్దు

నాతవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం గ్రామంలో రాజులబాబు, తలుపులమ్మ తల్లి ఆలయాల పక్కనే ఏర్పాటు చేసిన వైన్‌షాపును వేరే చోటకు మార్చాలని గ్రామస్థులు, హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి ఈ వైన్ షాపు మీదుగానే హైస్కూల్‌కు బాలికలు వెళ్లాలని, అలాగే నర్సీపట్నం కాలేజీలకు కూడా ఇలాగే వెళ్లాల్సి ఉందని, రోడ్డు పక్కనే మద్యం తాగి యువకులు ఉంటున్నారని, దీంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. డి.యర్రవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపును వేరే చోటుకు మార్చాలని ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి గుడి పక్కనే ఉన్న మద్యం దుకాణాన్ని మార్చాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి : ఎస్‌ఐ



తాజంగిలో పర్యాటక వికాస్ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

చింతపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాజంగి జలాశయం సాహస క్రీడలు, బోటింగ్‌లో పర్యాటకుల భద్రతకు నిర్వాహకులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, తాజంగి గ్రామ పంచాయతీల్లో ఆ యన పర్యటించారు. జలాశయం వద్ద సాహస క్రీడలు, లంబసింగి జంక్షన్‌లో ట్రాఫిక్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తాజంగి జలాశయంలో పర్యాటక వికాస్ సభ్యులతో మాట్లాడుతూ సాహస క్రీడలు, బోటింగ్ చేస్తున్న పర్యాటకులకు ప్రమాదాలు కలగకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా అసాంఘిక చర్యలకు పాల్పడరాదన్నారు. అనధికార మద్యం విక్రయాలు చేపట్టరాదన్నారు. ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండగా పర్యాటకులు నిబంధనలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో పర్యాటక వికాస్ చైర్మన్ శెట్టి శంకర్, టీడీపీ నాయకులు పురుషోత్తం, శ్యాంసుందర్, పాంగి రామారావు, జనసేన నాయకులు శెట్టి మోహనరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

గ్యాస్ లీక్.. తప్పిన ప్రమాదం



కించుమండ దుకాణంలో గ్యాస్ బండ నుంచి ఎగిసి పడుతున్న మంటలు

డుంబ్రిగుడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండలో ఓ దుకాణంలో గ్యాస్ లీకేజీ ఘటనలో ప్రమాదం తప్పింది. గ్రామానికి సంతోష్ అనే వ్యక్తి టీ స్టాల్ నడుపుకుంటున్నారు. టీ చేసే సమయంలో ఒక్కసారిగా గ్యాస్‌బండ నుంచి మంటలు ఎగసి పడ్డాయి. దీంతో దుకాణదారుల తోపాటు స్థానికులు పరుగు పెట్టారు. మంటలను అదుపు చేసేందుకుచేసినప్రయత్నాలు ఫలించలేదు.. అయితే అదేసమయంలో అటుగా వస్తున్న ట్రాక్టరులోడు ఇసుకను వేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించాలి

కొయ్యూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా వలన కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీలకు సీడీపీవో విజయకుమారి సూచించారు. ఆదివారం శరభన్నపాలెం, నడింపాలెం, తదితర సెక్టార్ల పరిధిలోని కార్యకర్తలతోసమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంజాయి సాగు, రవాణా నియంత్రణలపై శ్రద్ధ చూపాలన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంఘం అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జిగా రామారావు



రామారావును సన్మానిస్తున్న సభ్యులు

పాడేరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఎలక్ట్రీషిన్ల అసోసియేషన్ అనకాపల్లి ఇన్‌చార్జిగా కొట్టగుళ్లి రామారావును నియమిస్తూ రాష్ట్ర కార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన అసోసియేషన్ 17వ కార్యవర్గ సమావేశంలో రామారావును నియమించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గౌరవాధ్యక్షుడిగా రామారావు వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయనను తిరుపతి పట్టణ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంకరరావు, ఉపాధ్యక్షులు కె.పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంత పెద్ద సీతకోక చిలుకో..!



రామారావును సన్మానిస్తున్న సభ్యులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గన్నిక అనే వ్యక్తి ఇంటి పెరట్లో ఆదివారం భారీ సీతాకోకచిలుక ఆకట్టుకుంది. తెలుపు, నలుపు రంగులో భారీ సైజ్‌లో ఉంది. సహజంగా చిన్నగా ఉన్న సీతాకోకచిలుకలుతరచూ కనిపిస్తాయి. ఇది పెద్ద సైజులో ఉండటంతో పరిసరవాసులు దీనిని చూసేందుకు ఆసక్తి చూపారు. సెల్ ఫోన్లలో బంధించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

- పలు సంఘాల నేతలు డిమాండ్
- ముంచంగిపుట్టులో రహదారిపై బైఠాయించి నిరసన
- విద్యార్థి మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపాల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నినాదాలు



అంబులెన్స్‌లో చేరుకున్న విద్యార్థి మృతదేహం



ముంచంగిపుట్టు ప్రధాన రహదారిపై బైఠాయించిన వివిధ సంఘాలు, పార్టీల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అరకు ఏపీఆర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి బి.ప్రవీణ్ మృతికి కారణమైన వైస్ ప్రిన్స్‌పాల్‌పై ఎస్టీఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, సీపీఎం, వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో కలసి మండల కేంద్రంలో ఆదివారం భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు గ్రామానికి చెందిన విద్యార్థి ప్రవీణ్ మృతదేహం మండల కేంద్రానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థి మృతిపై సమగ్రమైన విచారణ చేపట్టాలని, వైస్ ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపాల్‌ను జిల్లా అధికారులు కేవలం సస్పెన్స్‌తో సరిపెట్టేశారని, విద్యార్థి శరీరంపై గాయాలున్నా లేని పోని వ్యాధులను చూపి వైస్ ప్రిన్సిపాల్‌ను రక్షించే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే వరకు రోడ్డుపై నుంచి కదిలే ప్రసక్తే లేదని సంఘాల నేతలు తెలిపారు. పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు భీష్మించారు. దీంతో ఆందోళన రాత్రి 10.30 గంటలు అయినప్పటికీ కొనసాగుతోంది.

బాధిత విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

- కలెక్టర్ దినేష్‌కుమార్, పీవో అభిషేక్



కేజీహెచ్ వద్ద మృతిచెందిన విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీడీ రజిని

పాడేరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన అరకువేలి గురుకుల (పీవీటీజీ) పాఠశాల విద్యార్థి బడ్నాయిని రవికిరణ్ మృతదేహానికి కేజీహెచ్‌లో ఆదివారం పోస్టుమార్టం పూర్తి చేశారన్నారు. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించి ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్టు గ్రామానికి అంబులెన్స్‌లో తరలించారన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని శనివారం రాత్రి కేజీహెచ్‌కు చేరుకొని మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పోస్టుమార్టం పూర్తయ్యేంత వరకు అక్కడే ఉండి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేశారన్నారు. ఇటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇస్తామని అధికారులు వెల్లడించారు. ప్రవీణ్‌కుమార్ మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రూ. 10 లక్షల పరిహారం అందించాలి: విద్యార్థి సంఘ నేతలు

పాడేరురూరల్: అరకువేలి గురుకుల (పీవీటీజీ) పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చేసిన దాడిలో గాయపడి కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మృతి చెందిన విద్యార్థి బడ్నాయిని రవికిరణ్‌కు పోస్టు మార్టం చేపట్టి అంబులెన్స్‌లో దొంగ దారిన స్వగ్రామానికి తరలించడం అన్యాయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.జీవన్‌కృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆరోపించారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయకుండా గ్రామానికి తరలించడం అన్యాయమన్నారు. విద్యార్థి మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మరణాలపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఐటీడీఏ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్న, రావణ్, చిన్నారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌టీల సమస్యలపై వినతి



మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న సీఆర్‌టీలు

పాడేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపై కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ టీడీపీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. సీఆర్‌టీలను రెగ్యులర్ చేసే ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని, కొందరినే రెగ్యులర్ చేసినట్టు తెలిపారు. అర్హత ఉన్న వారికి న్యాయం చేయాలని బాధిత సీఆర్‌టీలు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

'ఉద్యాన సహాయకుల హేతుబద్ధీకరణ ఆపాలి'

పాడేరురూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన సహాయకుల హేతుబద్ధీకరణను తక్షణమే నిలుపు చేయాలని ఉద్యాన సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి రాజు డిమాండ్ చేశారు. జిల్లాలోని క్షేత్రస్థాయిలో ఉన్న ఉద్యాన పంటల విస్తీర్ణం ఆదారంగా మండల వారీగా అవసరమైన చోట ఉద్యాన సహాయకులుగా జిల్లా వ్యాప్తంగా 122 మందిని నియమించారు. వీటితో పాటు ఉద్యాన పంటల విస్తీర్ణంను పరిగణలోకి తీసుకొని అదనంగా 76 మంది ఉద్యాన సహాకులను నియమించారు. ఈ సహాయకుల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యాన సహాయకుల స్థానంలో వ్యవసాయ సహాయకుల పోస్టులను నియమించాలని ఉన్నతాధికారులు ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈ ప్రక్రియ కొనసాగితే మండలాల్లో ఉద్యాన సహాయకుల పోస్టులు పూర్తిగా కుదించుకుపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

కాఫీ పోత్సాహక నిధులు ఏమయ్యాయి?: సీపీఎం



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న చిన్నయ్య పడాల్, నాయకులు

జి.మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అందాల్సిన కాఫీ ప్రోత్సాహక నిధులు రూ. 5కోట్లు ఏం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. మండలంలోని ఆ పార్టీ ఏ డవ మహాసభలు ఆదివారం గెమ్మిలి పంచాయతీ మహాదేవపురంలో నిర్వహించారు. ముందుగా సీపీఎం సీనియర్ నేత వనుగు సన్యాసిదొర పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, కాఫీ రైతులకు అపెక్స్ కమిటీ ప్రకటించిన ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. పాస్‌మెంట్ ధర కిలో రూ. 500 , చెర్రి రూ. 300, రొబోట్రో రూ. 200, పండు రూ. 100 చొప్పున ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి పథకం పనులు వేతనాలు చట్టం ప్రకారం రోజు రూ. 300లు చెల్లించి గిరిజన ప్రాంతంలో ఏడాదికి 200 రోజుల పనిదినాలకు పెంచాలని డిమాండ్ చేశారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గిరిజనులు పండించే ముడి సరుకులపై గిట్టుబాటు ధరకు చట్టం రుపొందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు జగ్గందొర దీనబంధు, సంకయ్య, ధర్మయ్య దొర, పిన్నంనాయుడు, సత్తిబాబు, గణపతి, మధు, ఈశ్వరమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

- రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు



దిగువసాలముల గ్రామస్థులకు టీడీపీ సభ్యత్వంపై వివరిస్తున్న నాగరాజు

పాడేరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కీలకమైన కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, కార్యదర్శి లోకేశ్ కృషి చేస్తున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి కిల్లో శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం ఇరడాపల్లి పంచాయతీ దిగువసాలములు, రాయిగెడ్డ, బొక్కెళ్ల గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదుపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందిన కార్యకర్తకు ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు అందించడంతో పాటు కార్యకర్త కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుసుకునేలా చర్యలు తీసుకున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ డప్పోడి వెంకటరమణ, మండల రైతు సంఘం అధ్యక్షుడు రేగం కొండబాబు, నాయకులు రాంబాబు, కొండబాబు, దొర అప్పన్న, భాస్కరరావు, రాంబాబు, మర్రి సన్యాసి, వంతాల రామన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి

- జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మండమూరి పారయ్య



చెకుముకి జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో విజేతలుగా నిలిచిన అక్షర పాఠశాల విద్యార్థులు



అరకు క్రీడా పాఠశాల విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న పారయ్య

పాడేరురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మండమూరి పారయ్య కోరారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్యం కలిగి ఉండాలన్నారు. నాటు, పసర మందులకు ప్రజలను దూరం చేయాల్సిన బాధ్యతను చేపట్టాలని కోరారు. అనంతరం పాడేరు సబ్‌డివిజన్ పరిధిలోని పాడేరు, అరకు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి ఏడు మండలాలకు చెందిన తొమ్మిది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చెందిన విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులను నిర్వహించారు. ప్రభుత్వ విభాగం నుంచి అరకు క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానం, పెదబయలు మండలం సీకరి బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగానికి చెందిన పాడేరు అక్షర పాఠశాల విద్యార్థులు ప్రథమ, పెదబయలు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానాలను సాధించారన్నారు. ప్రథమ స్థానం కైవసం చేసుకున్న అరకు క్రీడా పాఠశాల విద్యార్థులు, అక్షర పాఠశాల విద్యార్థులను నవంబరు 9న విశాఖలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని ఆయన తెలిపారు.



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరురూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతోపాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో రావడంతో ఉదయం 6 గంటల నుంచి రద్దీ నెలకొంది. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పండగను కుటుంబ సభ్యులతో జరుపుకున్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు పర్యవేక్షణలో భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. పాడేరు ఘాట్ మార్గంలోని మోదాపల్లి జంక్షన్ వద్దనున్న అమ్మవారి పాదాలకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు.

చింతాలమ్మతల్లికి మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని ప్రార్థిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు

కొయ్యూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడొంపుల ఘాట్ వద్ద కొలువుదీరిన చింతాలమ్మ తల్లి మొక్కుకు ఆదివారం రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి కుటుం బ సమేతంగా విచ్చేసి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గుడిఆవరణలో భారీగా విందు భోజనాలు ఏర్పాటు చేశా రు. రంపచోడవరం, పాడేరు నియోజక వర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



కొలువుదీరిన విగ్రహాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దైవ నామ జపంతో సకల సంతోషాలు కలుగుతాయని భీమిలి సద్గురు సేవాశ్రమం స్వామిజీ సాయిరాం సూచించారు. ఆదివారం మండలంలో చీడిపాలెం పంచాయతీ శింగవరం ఐటీడీఏ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామిజీ సమకూర్చిన హనుమాన్ సహిత సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహించారు. శింగవరానికి చెందిన జలుమూరి గిరిబాబు దంపతుల చేతుల మీదుగా స్వామిజీ పర్యవేక్షణలో స్వరూపానంద శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఈ కార్య క్రమం నిర్వహించారు. అనంతరం ఎనిమిది మంది దంపతుల చేతుల మీదుగా శ్రీరామ కల్యాణాన్ని జరిపించారు. అనంతరం సమారాధనను గ్రామస్థులు, దాతల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరాం స్వామీజీ మాట్లాడారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకుంటే విగ్రహాలు ఉచితంగా అం దచేస్తామన్నారు. ఇప్పటికే మండలంలో 118 గుడులకు విగ్రహాలను తమ సేవాశ్రమం ద్వారా ఇచ్చినట్టు వివరించించారు. ఎటువంటి విరాళాలు సేకరించకుండా గుడి నిర్మించుకున్న ఐటీడీఏ కాలనీ వాసులను స్వామిజీ అ భినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

108లో గిరి మహిళ ప్రసవం



108 వాహనంలో తల్లీశిశువు

అనంతగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరి మహిళ 108లోని ప్రసవించిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన వంతాల వనజ నిండు గర్భిణి. ఆదివారం ఉద యం పురిటినొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారమిచ్చారు. వెంటనే వాహనం వచ్చి వనజను తరలిస్తుండగా మార్గమధ్యన కాశీపట్నం వద్ద పురిటినొప్పులు మరింత అధికమవ్వడంతో ఈఎంటీ మౌనిక వైద్యసేవలందించారు. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 సిబ్బంది తెలిపారు. వారిని వైద్యసేవలు నిమిత్తం ఎస్. కోట ఆస్పత్రికి తరలించారు.

మాజీ సైనికునికి ఘన నివాళి



మాజీ సైనికుని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరమ పంచాయతీ నందివలస గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పాంగి మల్లన్న అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రెగం మత్స్యలింగం ఆ గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి ఓదార్చారు. దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, సర్పంచులు సుబ్బారావు, సుస్మిత, నాయకులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన గిరిజనుడి మృతదేహం లభ్యం

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతమైన డుడుమ జలాశయం దిగువ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన గిరిజనుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. ఒడిశాలోని కోరాపుట్టు జిల్లా నందపూర్ బ్లాక్ ఒనకడిల్లీ పంచాయతీ కుదుగూడ గ్రామానికి చెందిన గొల్లోరి శుక్ర గత గురువారం సాయంత్రం డుడుమ జలాశయం దిగువ ప్రాంతంలో జలపాత ప్రవాహ నీటిలో చేపల వేటకువెళ్లి గల్లంతయిన విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో గెడ్డలో మృతదేహం ఉన్న ప్రదేశాన్ని గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు.శవశశ కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండేళ్ల క్రితం ఇదే గెడ్డలో చేపల వేటకు వెళ్లిన శుక్ర సోదరుడు సొమర మృతి చెందగా, ఇప్పుడు అదే తరహాలో చేపల వేటకు వెళ్లిన శుక్ర మృతి చెందడంతప్రాంతీయులను కలచివేస్తోంది.

'ఇంటి పునాది ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

అరకులోయ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్మాపురం గ్రామ పంచాయతీ పరిధి జ్యోతి సినిమాహాల్ సమీపంలో తనకు ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణ చేపట్టిన పునాదిని ధ్వంసం చేశారని మాజీ సమితి అధ్యక్షుడు సాగరి రామచందరరావు ఆందోళన వ్యక్తం చేశారు. అరకులోయలో ఇటీవల కాలంలో భూమాఫియా దందాదారులు కొందరు అక్రమంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇందులో భాగంగా తన పేరున ఉన్న సర్వే నెంబరు 86-1ఏ లో తనకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంటే శనివారం రాత్రి కొంతమంది ప్రత్యర్థులు వీటిని కూల్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పునాది కూల్చివేసి వారిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పెద్ద చెరువు వద్ద శుభ్రం చేయిస్తున్న కమిషనర్ సురేంద్ర

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

» నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద సీసీ కెమెరాలు

» మునిసిపల్ కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారులపై చెత్త వేసే వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర హెచ్చరించారు. ఆదివారం పెద్ద చెరువు వద్ద పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు వద్ద త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో బహిరంగ మల విసర్జన, పండ్లు, కూరగాయాల వ్యర్థాలు, జంతు కళేబరాలు వేయడం వల్ల దుర్వాసన వ్యాపిస్తున్నదన్నారు. ప్రతీ రోజు చెత్త ఎత్తిస్తున్నా మర్నాడు మళ్లీ వేస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే బొంతువీధి సాయిబాబా గుడి ప్రవేశ మార్గంలో పండ్లు, పువ్వులు, కూరగాయ వ్యాపారులు రోడ్డు మీద వ్యర్థాలు పడేస్తున్నారని తెలిపారు. అనకాపల్లి రోడ్డులో కూడా అదే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు మీద చెత్త పోస్తున్న వ్యక్తులను గుర్తించి జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. స్పీకర్ ఆదేశాలతో కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకొని భక్తులు పుణ్య స్నానాలకు లుగా ఉత్తర వాహిని వద్ద శుభ్రం చేయిస్తున్నామని కమిషనర్ చెప్పారు.

సేంద్రియ ఎరువులతో సమగ్ర పోషకాలు

» కృషి విజ్ఞాన కేంద్రం ప్రొఫెసర్ సౌజన్య

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటలకు సమగ్ర పోషకాలు అందుతాయని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కొండెంపూడి ప్రొఫెసర్ డాక్టరు సౌజన్య అన్నారు. ఆదివారం పీఏసీఎస్ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందుల వినియోగం వల్ల సాగు ఖర్చు అధికమవుతుందన్నారు. అలాగే కాలక్రమేణా సూక్ష్మ పోషకాల లోపాలు అధికమవుతాయన్నారు. కంపోస్టు, పశువుల ఎరువులను తయారు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను సౌజన్య, డాక్టరు రవిబాబు వివరించారు.

జవహర్‌క్లబ్ నూతన పాలకవర్గం ఎన్నిక

చోడవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానమైన జవహర్ క్లబ్‌కు ఆదివారం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. పాలకవర్గం నూతన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది పోతల ప్రకాశరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బుద్ధా వెంకటరమణ, కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.రవీంద్ర ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా బి.మధుసూదనరావు, బి.జగన్నాథకుమార్, డి.వెంకటరావు, కె.ఈశ్వరరావు, పి.లక్ష్మణరావు, మురళీకృష్ణ ఎన్నికయ్యారు.

బుచ్చెయ్యపేటలో రక్తదాన శిబిరం రేపు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బ్లెస్సింగ్ చర్చి వద్ద సీఎల్‌సీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 29న రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుంది. అలాగే జనరల్, కంటి వైద్య వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన్ సంస్థ వైద్య నిపుణులు, అన్ని రకాల వ్యాధులనిపుణులతో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తామని బ్లెస్సింగ్ చర్చి ప్రతినిధులు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిర్‌పోర్టుకు అల్లూరి నామకరణం హర్షణీయం

స్పీకర్ అయ్యన్నపాత్రుడును సన్మానించిన క్షత్రియులు

నర్సీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని నిర్ణయించడం హర్షణీయమని క్షత్రియ పరిషత్ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు గణపతిరాజు బంగార్రాజు ఆధ్వర్యంలో వేదపండితుల ఆశీర్వచనాలతో సభాపతి అయ్యన్నపాత్రుడును సన్మానించారు. ఎయిర్‌పోర్టుకు అల్లూరి పెట్టేందుకు స్పీకర్ అయ్యన్న ఎంతో కృషి చేశారని వారు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ చదువుకునే రోజుల నుంచి రాజులతో తనకు సత్సంబంధాలు ఉండేవన్నారు. ఎన్నికలలో ప్రతీసారి సహాయ సహకారాలు అందించారన్నారు. పెదబొడ్డేపల్లి మదుం వద్ద రెండు వంతెన మధ్యలో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని అయ్యన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ ప్రతినిధులు చక్రపాణి రాజు, నాగేంద్ర రాజు, మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబురాజు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు జ్ఞాపిక అందిస్తున్న క్షత్రియ పరిషత్ ప్రతినిధులు

పాల సేకరణ ధర తగ్గింపుపై రైతుల ఆందోళన

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ తగ్గించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు ఆందోళనకు దిగారు. మండలంలో పలు గ్రామాల్లో పాల కేన్లతో ధర్నాలు చేశారు. మాడుగులలో జరిగిన కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ పాల సేకరణ ధర తగ్గించి పాడి రైతుల జీవనోపాధికి గండికొట్టడం అన్యాయమన్నారు. మూడు లక్షలకుపైగా రైతులు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వారంతా ఆవులు, గేదెలకు మేత దొరకని పరిస్థితుల్లో రోజంతా దాన సేకరించి మేపుకొని, వాటికి వచ్చిన పాలను విక్రయించి కుటుంబ పోషణ చేసుకుంటున్నారని చెప్పారు. అలాంటి రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధర కల్పించాల్సిన డెయిరీలు, తగ్గించి వారి పొట్ట కొట్టడం అన్యాయమని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా విశాఖ డెయిరీ వద్ద మంగళవారం నిర్వహించనున్న సమావేశానికి పాడి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరట నరిసంహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత బీటీ దొర పాల్గొన్నారు.





మాడుగులలో పాల కేన్లతో నినాదాలు చేస్తున్న పాడి రైతులు... బుచ్చెయ్యపేట పాడి రైతుల నిరసన

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని బంగారుమెట్ట, బుచ్చెయ్యపేట పాల సేకరణ కేంద్రాల వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం చోడవరం డివిజన్ నేత పినపాత్రుని సాంబశివరావు మాట్లాడుతూ, విశాఖ డెయిరీకి రైతులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పాలు పోస్తున్నారని, అయినా రైతులకు గిటుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయం గిటుబాటు కాకపోవడంతో పాడిపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారన్నారు. గతంలో ఉన్న ధర కన్నా లీటరు ఆవు పాలకు రూ.3 తగ్గిస్తున్నట్టు విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. పెరుగుతున్న దాణా ఖర్చులతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రస్తుత ధర కన్నా లీటరు రూ.10 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. తగ్గించిన పాలధరను పెంచే వరకు తమ పోరాటం కొనసాగుతందని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాంబశివరావు పాడి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రతినిధులు ఎస్‌వీ నాయుడు, దాడి నాయుడు, పూడి రామారావు పాల్గొన్నారు.

రెల్లి సామాజిక వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంగళగిరి ప్రసాదరావు

కృష్ణాదేవిపే, అక్టోబరు 27 ఆంధ్రజ్యోతి): రెల్లి సామాజిక వర్గానికి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంగళగిరి ప్రసాదరావు డిమాండ్ చేశారు. గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం రెల్లివీధిలో ఆదివారం రెల్లి కులస్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది రెల్లి సామాజిక వర్గం వారు ఉండగా, ఎస్సీ వర్గీకరణలో ఒక్క శాతం రిజర్వేషన్ కల్పించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తెలుగు రాష్ట్రాల సీఎంలు పునరాలోచన చేయాలని, తమకు ఐదు శాతానికి రిజర్వేషన్ పెంచాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో రెల్లి సంఘం నాయకులు యర్రంశెట్టి అప్పన్నబాబు, మజ్జి సత్యనారాయణ, బంగారు లక్ష్మీనారాయణ, కోన రాజుబాబు, కన్నబాబు, నూకరాజు, రెల్లి యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదరావు

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే మరి కొంతమంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. గ్రామంలో కాలినడకన నెత్తిన ఘటాలతో ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు న్యాయవాది శ్రీనాధ ప్రసాదరావు ఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని దర్శనానికి వచ్చిన భక్తులకు కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



'గుడి పక్కన వైన్‌షాపు వద్దు'

నాతవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.యర్రవరం గ్రామంలో రాజులబాబు, తలుపులమ్మతల్లి ఆలయాల పక్కనే ఏర్పాటు చేసిన వైన్‌షాపును వేరే చోటకు మార్చాలని గ్రామస్థులు, హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి ఈ వైన్ షాపు మీదుగానే హైస్కూల్‌కు బాలికలు వెళ్లాలని, అలాగే నర్సీపట్నం కాలేజీలకు కూడా ఇలాగే వెళ్లాల్సి ఉందని, రోడ్డు పక్కనే మద్యం తాగి యువకులు ఉంటున్నారని, దీంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. డి.యర్రవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపును వేరే చోటుకు మార్చాలని ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి గుడి పక్కనే ఉన్న మద్యం దుకాణాన్ని మార్చాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

గొలుగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పండగల సందర్భంగా అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామారావు హెచ్చరించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ దీపావళి, నాగులచవితి సందర్భంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వాటిని విక్రయించాలంటే పోలీసుల నుంచి అనుమతులు పొందాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కృష్ణాదేవిపే, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట గ్రామానికి చెందిన దారకొండ శ్రీనివాసరావు కుటుంబానికి అతని స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. 2000-2001 టెన్త్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, పూర్వ విద్యార్థులంతా రూ.30 వేలు సమీకరించుకుని ఆదివారం అందించారు. అలాగే భవిష్యత్తులోనూ సాయం చేస్తామని బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గండేపల్లి రవీంద్ర, పెదపూడి శివ, పసుపులేటి శ్రీనివాసరావు, అంకంరెడ్డి దుర్గాప్రసాద్, దేవారపు ప్రసాద్, కనకరాజు, సూరిబాబు, యేసు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో స్నేహితుడు కుటుంబానికి నగదు అందిస్తున్న దృశ్యం

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



గొలుగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ వసతిగృహంలో విద్యార్థులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేసినట్టు ఏఎస్‌డబ్ల్యూవో వి.గోపీనాథరావు చేశారు. గొలుగొండ బీసీ వసతి గృహంతో పాటు నర్సీపట్నం, వేములపూడి గ్రామంలో బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో 1540 మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేసినట్టు చెప్పారు. చలికాలం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మడ్డు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వారపు సంత.. ట్రాఫిక్ చింత

» మాడుగులలో జటిలంగా మారుతున్న సమస్య

» పట్టించుకోని అధికారులు.. వాహన చోదకుల అవస్థలు

మాడుగుల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగే వారపు సంతలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. రోజురోజుకూ ఈ సమస్య జటిలమవుతోంది. ప్రతీ సోమవారం, గురువారాల్లో జరిగే సంతలో రోడ్లపైనే దుకాణాలు వేసి వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. అంతేకాకుండా సంతకు తీసుకు వచ్చిన కాయకూరలు, బట్టలు, వివిధ సామగ్రి వాహనాలను రోడ్లపైనే నిలిపివేయడంతో సమస్య తీవ్రతరమవుతోంది. అలాగే మండల పరిషత్ కార్యాలయం, జూనియర్ కళాశాల, కోర్టుకి వెళ్లే దారిలో కూడా పండ్ల దుకాణాలు రోడ్డు మధ్యలోనే పెట్టడం కారణంగా విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో బాధిత ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైళ్లలో చోరీలు చేస్తున్న ఎలమంచిలి వ్యక్తి అరెస్టు

రూ.3.11 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

పాయకరావుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా పలు రైళ్లలో దొంగతనాలు చేస్తున్న ఎలమంచిలికి చెందిన ఒకరిని ఆదివారం తుని ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రూ.3.11 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. డీఎస్పీ డి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం తుని రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించి, వివిధ రైళ్లలో ప్రయాణికుల నుంచి నగదు, బంగారు వస్తువుల దొంగతనాలకు పాల్పడుతున్న ఎలమంచిలికి చెందిన నరాలశెట్టి జోతిస్ దుర్గాప్రసాద్(19)ను పట్టుకున్నట్టు చెప్పారు. అతడి నుంచి 47 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.ఆరు వేలు నగదు కలిపి రూ.3,11,500 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో కాకినాడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తుని, అనకాపల్లి ఆర్పీఎఫ్ ఏఎస్ఐలు గోవిందరాజు, అనిల్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పినకోట రోడ్డులో చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు

దేవరాపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా నుంచి దేవరాపల్లి మీదుగా గంజాయి రవాణా నిరోధానికి పినకోట రహదారిలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవరాపల్లి సమీపంలోని శ్రీరాంపురం జైజంక్షన్‌లో ఈ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి, ఎనిమిది మంది పోలీసు సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని ఈ సందర్భంగా ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు.

'ప్రభాకరరావు చౌదరి సేవలు మరవలేనివి'

నాతవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త ఎం.ప్రభాకరరావు చౌదరి నాతవరం మండలానికి అందించిన సేవలు మరువలేనివని టీడీపీ మండల నాయకుడు కోరుప్రోలు వెంకటేశ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లేడిపూడిలో ప్రభకరరావు చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3 కోట్లతో నూకాంబికా తదితర ఆలయాలను నిర్మించి ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మికత కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. జీడిపిక్కల ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి ఎందరో మహిళలకు ఉపాధి చూపారన్నారు. స్థానిక నాయకులు సన్యాసినాయుడు, లాలం వెంకటరమణ పాల్గొన్నారు.

వినికిడి లోపం... పిల్లలకు శాపం!

విశాఖపట్నం, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): 'బాబుకు ఐదేళ్లు వచ్చేసింది. ఏమీ మాట్లాడడం లేదు. పెద్ద శబ్దాలకు కూడా స్పందించడం లేదు. ఏమైందో అర్థం కావడం లేదు. ఆలస్యంగా మాటలు వస్తాయనుకున్నామే గానీ వినికిడి సమస్య ఉందని గుర్తించలేకపోయాం. ఏమైందో అర్థం కావడం లేదు. బాబు మాట్లాడేలా చేయండి సార్'... ఇదీ నగర పరిధిలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి బిడ్డను తీసుకువచ్చిన ఒక తల్లి వైద్యుడితో వ్యక్తం చేసిన ఆవేదన.

- సకాలంలో గుర్తించడంలో విఫలమవుతున్న తల్లిదండ్రులు
- కొన్నాళ్లుగా పెరుగుతున్న కేసులు
- రెండేళ్లలోపు సమస్యను గుర్తిస్తే శస్త్ర చికిత్సతో ఫలితం
- ఉచితంగా రూ.12 లక్షల కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స చేయిస్తున్న ప్రభుత్వం



వినికిడి లోపం అతిపెద్ద సమస్య. చిన్నారుల్లో ఈ సమస్య అధికంగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా దేశంలో లక్ష మందికి పైగా చిన్నారులు వినికిడి సంబంధిత సమస్యతో పుడుతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ సమస్య పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది.వీలైనంత త్వరగా గుర్తించి, సరైన సమయంలో చికిత్స చేయించడం అత్యంత అవసరం. పుట్టుకతో వస్తున్న వినికిడి సమస్యను గుర్తించడంలో ఎంతో మంది తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. ఇది ఆయా చిన్నారులు పాలిటశాపంగా మారుతోంది.

వినికిడి, మాటలకు అవినాభావ సంబంధం ఉంది. శబ్దం వినగలిగే సామర్థ్యం ఉన్నప్పుడే దానికి ప్రతి స్పందనగా మాటలు వస్తాయి. కానీ, వినికిడి సామర్థ్యం లేకపోతే ప్రతిస్పందించే గుణంగా తగ్గిపోతుంది. క్రమంగా సదరు చిన్నారి మూగగా మారేందుకు కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న కేసులు..

గతంతో పోలిస్తే ఈ తరహా కేసులు పెరుగుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. మాట్లాడడం లేదని, వినికిడి సమస్య ఉందంటూ వస్తున్న కేసులు భారీగా ఉంటున్నాయి. నగర పరిధిలోని ఈఎన్‌టీ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో ఉండే ఈఎన్‌టీ వైద్య నిపుణులు వద్దకు ప్రతినెలా కనీసం ఈ తరహా కేసులు 50 వరకు వస్తున్నాయి. వీరిలో కనీసం 30 మందికి స్పీచ్ థెరపీ నిర్వహించడం ద్వారా మాటలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. మరో 20 మంది వరకు వినికిడి సమస్యతో బాధ పడుతున్నట్టు గుర్తిస్తున్నారు. వీరిలో పది మంది చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తోందని వైద్యులు గుర్తిస్తున్నారు. సాధారణంగా పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న వారిని రెండేళ్లలోపు గుర్తించి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించడం వల్ల మెరుగైన ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, చాలామంది పిల్లల్లో ఉన్న ఈ సమస్యను గుర్తించ లేకపోవడంతో ఐదారేళ్ల తరువాత కూడా వైద్యుల వద్దకు తీసుకువస్తున్నారు. వీరికి శస్త్ర చికిత్సను నిర్వహించవచ్చు. కానీ, కొన్నిసార్లు మెరుగైన ఫలితాలు రాకపోవచ్చని వైద్యులు చెబుతున్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స నిర్వహించేందుకు రూ.10 నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ శస్త్రచికిత్సను ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ప్రతి నెలా ఈ శస్త్రచికిత్సలు నాలుగు వరకు నిర్వహిస్తుండగా, ప్రైవేటు ఆస్పత్రుల్లో మరో ఎనిమిది వరకు చేస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.



స్ర్కీనింగ్ పరీక్షతో మేలు..

వినికిడి సమస్యను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వాలు, వైద్య నిపుణులు నవజాత శిశువులు పుట్టిన వెంటనే వారికి వికినిడి పరీక్షను నిర్వహించేలా చేస్తున్నాయి. కేజీహెచ్‌తో పాటు అనేక ప్రైవేటు ఆస్పత్రుల్లో వినికిడి పరీక్షను నిర్వహిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఈ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది ఎదురవుతోంది. బెరా వంటి పరీక్షను నిర్వహించి వినికిడి సమస్యను నిర్ధారిస్తారు.



స్పీచ్ థెరపీ తప్పనిసరి..

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స తరువాత చిన్నారికి కనీసం మూడేళ్ల పాటు స్పీచ్ థెరపీ ఇప్పించాల్సి ఉంటుంది. అప్పుడే మిగిలిన చిన్నారుల మాదిరిగా పిల్లలు మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది. దీనినే ఆడియో వెర్బల్ థెరపీ అంటారు. ఈ థెరపీని ఇవ్వడం వల్ల జీవితాన్ని సాధారణ పిల్లలు మాదిరిగానే లీడ్ చేసుకునే అవకాశముంది.

ఇవీ కారణాలు..

పిల్లల్లో వినికిడి లోపానికి అనేక కారణాలు దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొందరికి వంశపారంపర్యంగా వస్తుంటే, మరికొందరికి తల్లిదండ్రుల్లో లోపముంటే పిల్లలకు వచ్చే అవకాశం ఉంది. గర్భధారణ సమయంలో తల్లికి రూబెల్లా, సైటోమెగాలే వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చినా పిల్లలు ఈ సమస్య బారిన పడే అవకాశముంది. కొన్నిసార్లు తల్లి వేసుకునే మందులు వికటించడమూ కారణం కావచ్చు. కాన్పు సమయంలో ఎదురు కాళ్లతో జన్మించడం, మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వంటి కారణాలు ఈ సమస్యకు దోహదం చేయవచ్చు. పుట్టిన తరువాత చిన్నారులకు వచ్చే మెనింజైటిస్, మీజిల్స్, గవద బిళ్లలు వంటి ఇన్‌ఫెక్షన్లు కూడా కొందరి చిన్నారులకు హాని చేసే ప్రమాదం ఉంది. చెవికి దెబ్బ తగలడం, కొన్నిసార్లు జ్వరం వచ్చిన తరువాత కూడా పిల్లలు వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది.

రెండేళ్లలోపు గుర్తిస్తే ఫలితం



చిన్నారుల్లో వినికిడి సమస్య తీవ్రమైనది. తల్లిదండ్రులు సకాలంలో గుర్తించడం కీలకం. ఐదేళ్లు దాటే వరకు చాలా మంది తల్లిదండ్రులు ఈ సమస్యను గుర్తించలేకపోతున్నారు. ముందుగానే గుర్తిస్తే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స ద్వారా సాధారణ జీవితాన్ని లీడ్ చేయవచ్చు. ఆలస్యమైతే శస్త్రచికిత్స చేయించే అవకాశాన్ని కోల్పోతారు. కొన్నిసార్లు ఐదేళ్లు దాటిన వారికి చేసినా మెరుగైన ఫలితాలు ఉండవు. మాట్లాడడం లేదని, ఎంత గట్టిగా పిలిచినా స్పందించడం లేదంటూ మూడు, నాలుగేళ్ల తరువాత ఎంతో మంది తల్లిదండ్రులు పిల్లలను తీసుకువస్తున్నారు. వారిని పరీక్షిస్తే పుట్టుకతోనే ఈ తరహా సమస్య ఉందని తేలుతోంది. బెరా పరీక్ష ద్వారా సమస్యను వెంటనే గుర్తించవచ్చు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే పిల్లలు జీవితాంతం నరకయాతన అనుభవించాల్సి ఉంటుంది.

- డాక్టర్ బి.రామచంద్రరావు, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్య నిపుణులు

ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి



సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

తుమ్మపాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే వినియోగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. అనకాపల్లి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలోఆదివారం ఉపాధ్యాయులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించి సమయాన్ని వ్యర్థపరుస్తున్నారన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు దాదాపు 40 వరకు ఉన్న యాప్‌లలో ఆన్‌లైన్ పనులు చేస్తుండడం వల్ల బోధనా సమయం వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, వృత్తి అంతర శిక్షణ తరగతులు, కంప్యూటర్‌లో చేపట్టే ఆన్‌లైన్ పనులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఎంఈవోలను సైతం బోధనేతర పనులకు వాడుకోవడం దారుణంగా పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ అంశాలపై పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శ్రీలక్ష్మి, శేషుకుమార్, కళింగ సతీష్, యల్లయ్యబాబు, మాకిరెడ్డి రాజునాయుడు, నాతవరపు సతీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

'104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి'



ఎన్నికైన అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని 104 కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాంబాబు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమకు ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. రోజు రోజుకి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా వేతనాలు లేక కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆప్కాస్ నిర్ణయించిన వేతనాన్ని రూ.18,500లు కూడా ఇవ్వడం లేదని, అతి తక్కువ వేతనాలతో పనిచేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనంతరం 104 ఉద్యోగుల యూనియన్ అనకాపల్లి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా వీవీ శ్రీనివాసరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.నాగసాయి, ఆర్.అప్పలరమణ, ఉపాధ్యక్షుడిగా ఎస్.సూర్యకళ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మనీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.భార్గవ్, డివిజన్ లీడర్లుగా కిశోర్, శివలక్ష్మి (నర్సీపట్నం), రాజుబాబు, మధు (అనకాపల్లి), చిరంజీవి, మనీషా (చోడవరం), కోశాధికారిగా జి.చంద్రుడులను ఎన్నుకున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి కృషి

- గత ప్రభుత్వంలో ఆశించిన స్థాయిలో జరగలేదు
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 'పాకలపాటి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. పట్టణంలోని నరసింగరావుపేటలో ఆదివారం జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. శాసన మండలి వేదికగా కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. అయితే గత ప్రభుత్వంలో ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికీ పలు సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటన్నింటినీ పరిష్కరించి తీరుతామని హామీ ఇచ్చారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా ముందుకు వెళదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు, ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్, జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, ధర్మారావు, దుర్గాప్రసాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో సినిమా షూటింగ్ సందడి

- హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీలపై పలు సన్నివేశాలు చిత్రీకరణ

ముంచంగిపుట్టు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తీస్తున్న రాబిన్‌హుడ్ సినిమాకు సంబంధించి హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. జోలాపుట్టు నుంచి పాడువ వెళ్లే మార్గంలో, బలడ కేవ్స్, పాడువ సమీపంలోని మత్స్యగెడ్డ తదితర లోకేషన్‌ల్లో పలు సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ఈ సందర్భంగా నటీనటులను చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వారితో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు.



జోలాపుట్టులో హీరో నితిన్, హీరోయిన్ శ్రీలీల, సెట్‌లో పలువురు నటులు

అనకాపల్లిలో మెప్మా అర్బన్ మార్కెట్

- బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న డ్వాక్రా మహిళలు
- వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేసి విక్రయం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో డ్వాక్రా మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. తక్కువ వడ్డీతో తీసుకున్న రుణాలతో వివిధ రకాల నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేస్తూ వ్యాపార రంగంలోకి అడుగు పెడుతున్నారు. వీరు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను మెప్మా ఆదివారం అర్బన్ మార్కెట్ ద్వారా విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో మెప్మా ఏపీడీ వైసంతోష్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటరులో మహిళలు తయారుచేసిన ఆర్గానిక్ సోప్స్, కోకో వా చాక్లెట్లు, వివిధ రకాల పచ్చళ్లు, మసాలా సరకులు, వస్త్రాలు, వెదురుతో తయారుచేసే వివిధ రకాల బుట్టలు వంటివి వాటిని ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను తొలుత టీడీపీ నాయకుడు మళ్ల సురేంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలువురు స్థానికులు ఈ స్టాల్స్‌ను సందర్శించి అవసరమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వెదురుతో తయారుచేసిన బుట్టలు, పోషక విలువలతో కూడిన వివిధ తినుబండారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో ఏర్పాటైన మెప్మా అర్బన్ మార్కెట్



వెదురుతో తయారు చేసిన బుట్టలను పరిశీలిస్తున్న ఏపీడీ



అమ్మకానికి సిద్ధం చేసిన వివిధ వస్తువులు

'కంగువా'.. ప్రేక్షకులను అలరిస్తుంది

- నేచురల్ లైటింగ్‌లో సినిమా చిత్రీకరణ
- విభిన్న భాషలకు చెందిన నటీనటులు అంకితభావంతో పనిచేశారు
- కంగువా చిత్ర కథానాయకుడు, ప్రముఖ నటుడు సూర్య

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంగువా చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా విశాఖకు వచ్చిన సినిమా యూనిట్ నోవాటెల్‌లో 'వైజాగ్ కంగువా' పేరుతో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. 'కంగువా' సినిమాను స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. ఈ సమావేశంలో పాల్గొన్న చిత్ర కథా నాయకుడు, ప్రముఖ హీరో సూర్య మాట్లాడుతూ టికెట్ కొనుగోలు చేసిన ప్రతి ప్రేక్షకుడిని సినిమా అలరిస్తుందన్నారు. వచ్చే నెల 14న విడుదల అవు తున్న సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీ తాన్ని వీనులు విందైన సంగీతాన్ని అందిం చారన్నారు. సినిమా కోసం వివిధ భాష లకు చెందిన ఎంతో మంది నటీనటులు అంకితభావంతో పని చేశారన్నారు. సుమారు 700 ఏళ్ల క్రితం జరిగిన కథగా పేర్కొన్న సూర్య.. ఐదు తెగల మధ్య అధికారం కోసం జరిగిన పోరాటమే 'కంగువా' అని వెల్లడించారు. సినిమాను పూర్తిగా నేచురల్ లైటిం గ్‌లోనే చిత్రీకరించినట్టు వివరించారు. తెలుగులో శౌర్యం తీసిన దర్శకుడు శివ.. 'కంగువా'ను అద్భుతంగా తెరకె క్కించారన్నారు. హీరో నాగార్జున కూడా సినిమాను మెచ్చుకున్నట్టు వెల్లడించారు. బాబీ డియోల్ విలన్ పాత్రలో ఒదిగిపోయారన్న సూర్య.. చిత్రంలో పని చేసిన నటులంతా తమ స్థాయిలో అద్భుత ప్రతిభను కనబరిచారన్నారు. చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ మాట్లాడుతూ వెయ్యేళ్ల కిందట రెండు తెగల మధ్య జరిగిన పోరాటం నేపథ్యంగా సినిమా సాగుతుందన్నారు. నటుడు అవి నాష్ మాట్లాడుతూ సూర్యతో కలిసి నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.



మాట్లాడుతున్న హీరో సూర్య

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

పరవాడ (లంకెలపాలెం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఐదవ నంబరు జాతీయ రహదారిలోని తాడిమూడు మదాలు వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఏఎస్ఐ ప్రసాద్‌వర్మ తెలిపిన వివరాలివి. సుమారు అరవై సంవత్సరాల వయస్సు గల మహిళ శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో జాతీయ రహదారిలోని తాడిమూడు మదాలు వద్ద రోడ్డు దాటుతోంది. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. రహదారి పై పడి ఉన్న వృద్ధురాలిని పోలీసులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

విశాఖపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వర రావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీడేటా టెక్నాలజీస్, మాల్బియా డయోగ్నస్టిక్స్, 2నిధి ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఎంపికైన వారికి విశాఖపట్నం జిల్లాలో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆసక్తి గల యువత కళాశాలకు వచ్చి స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94906 32318 నంబర్‌కు సంప్రతించాలని ఆయన సూచించారు.

దివేష్ శర్మకు ఐదు వికెట్లు.. ఆంధ్ర 344 ఆలౌట్

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో హిమాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్రా తొలి ఇన్నింగ్స్ 344 పరుగుల వద్ద ముగిసింది. 295/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఆంధ్ర మరో 49 పరుగులకు చివరి నాలుగు వికెట్లు పడిపోయాయి. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ దివేష్ శర్మ ఐదు వికెట్లు పడగొట్టగా, రిషి ధావన్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన హిమాచల్‌ప్రదేశ్ రెండో రోజు ఆటముగిసే సరికి నాలుగు వికెట్లకు 198 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభమ్ అరోరా (16), ప్రశాంత్‌చోప్రా (10) విఫలంకాగా, అంకిత్ (53), ఆకాష్, వశిష్ట్ (52 నాటౌట్) అర్థ సెంచరీలతో ఆదుకున్నారు. రిషి ధావన్ (38 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. ఆంధ్ర బౌలర్లలో కెవి.శశికాంత్ మూడు వికెట్లు పడగొట్టగా, విజయ్ ఒక వికెట్ తీశాడు.

వీధులన్నీ కంపు!

... 7వ పేజీ తరువాయి

పుడుతున్నది. తరచూ కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసనతోపాటు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. పట్టణంలో పారిశుధ్యలోపంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలుచోట్ల రోజుల తరబడి కాలువల్లో చెత్త నిల్వ ఉండిపోవడంతో ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణకు కూడా చర్యలు చేపట్టకపోవడంతో ఎవరికి పడితే వారు ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో పడివేయడంతో రోజుల తరబడి కాలువల్లోనే ఉండిపోతున్నాయి. పలుచోట్ల చెత్తా చెదారం నిల్వ ఉండడం వల్ల మురుగునీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పూడిమడకరోడ్డులోని రామాలయానికి ఆనుకుని ఉన్న కాలువల్లో నీరు కాలువ గట్టుకు సమానంగా ప్రవహిస్తుంది. వర్షాలు పడే సమయంలో కాలువలో ఉన్న మురికినీరు సైతం రోడ్ల పైకి రావడం వల్ల ఆయా ప్రాంతాలు మురికికూపంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై శానిటరీ విభాగం సూపర్‌వైజర్ రవిని " ఆంధ్రజ్యోతి " వివరణ కోరగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం నుంచి కాలువల్లో పూడికలు తొలగించే పనులు చేపడతామన్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తాచెదారం తొలగిస్తున్నామని వివరించారు.

పక్కాగా పశుగణన

... 7వ పేజీ తరువాయి

సాగిస్తున్నాయి. వ్యవసాయం భారంగా మారడంతో పలువురు రైతులు పంటల సాగుకు స్వస్తిచెప్పి, పాడి పశువుల పోషణ వైపు మళ్లుతున్నారు. ఈ క్రమంలో పశువుల పెంపకందారులను ప్రోత్సహించేందుకు, భవిష్యత్తులో వారి ఆదాయాన్ని పెంచేందుకు, రుణాల మంజూరు, ఇతర పథకాల అమలు కోసం ప్రస్తుతం జరుగుతున్న పశుగణన ఎంతో దోహదపడుతుందని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. పశుగణన చేపట్టేందుకు జిల్లాలో 55 మంది సూపర్‌వైజర్లు, 571 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా పశువులు, జంతువులు, పక్షుల వివరాలు సేకరిస్తారు. ఇద్దరు సంయుక్త సంచాలకులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.

జిల్లాలో 33.66 లక్షలు..!

జిల్లాలో 2018లో జరిగిన పశుగణన వివరాల ప్రకారం ఆవులు 1.85 లక్షలు, గేదెలు 2.5 లక్షలు, గొర్రెలు 1.61 లక్షలు మేకలు, 1.81 లక్షలు పందులు నాలుగు వేలు వున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల పశువులు, జీవాలు, కోళ్లు కలిపి సుమారు 33.66 లక్షల వరకు వుంటాయని పశుసంవర్థక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రాణం తీసిన వేగం

... 7వ పేజీ తరువాయి

తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సీఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పెందుర్తి ఆదిత్యనగర్‌కు చెందిన చిరు వ్యాపారి దొడ్డి రామకృష్ణ కుమారుడు దొడ్డి ధనుంజయ్ గీతం కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా, అతడి మిత్రుడు మోహనసాయి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.